కథానిక

# ఆడ పెత్తనం

"సుబ్బన్న"

చల్లనికబురు చెవిని పడేసరికి అందల మెక్కినట్టుగా ఉంది.

"పాత ఊరికి మూడుమైళ్లదూరాన కొత్తగా కట్టిన డాబా ఇల్లు. అరవైరూపాయిల అద్దె" అన్నాడు అన్నయ్య.

అందమైన ఇంటికోసం ఆరాటపడే నా మనస్సు ముందుకు దూకింది:

"చుట్టూ ప్రహరీ. దానిలోపల పూల మొక్కలు. వాటి మధ్యన కొత్తడాబా ఇల్లు. రంగుపూసిన కిటికీలు. పెద్దపెద్ద అల్మారాలు. రెండుమూడు ప్రత్యేకపు గదులు అందులో దక్షిణంవైపు ముందు గదిలో నా సామాను-"

ఈ ఊహ సంతోషంగాను తృప్తిగాను ఉంది.

"దొడ్లో బావి ఉన్నది" అన్నాడన్నయ్య.

"ఇంకేం? బావిచుట్టూ మెట్ల తామరపూలు, కొంచెం అవతలగా అరటిచెట్లు. మా అమ్మ తోటకూర మళ్ళు పెడతానంటుంది. నే నెందు కొప్పుకొంటాను? వెధవ తోటకూర! అలా పెడితే మోపెడు దొరుకుతుంది. పూల మొక్కలు పెంచాలి" అని నిర్ణయించుకొన్నాను. విత్తనాలకోసం పోచా కంపెనీకి ఉత్తరం వ్రాయాలి.

ఆ సాయంకాలమే సామానంతా సర్ది బళ్ళ కోసం తయారుగా ఉన్నాము. త్వరగా పోవచ్చని బళ్ళవాళ్ళతోపాటు నేనూ సామాను చేరవేశాను, అన్నయ్య అందుకొన్నాడు. ముందు పోయే సామాను బండిలో కూర్చున్నాను. బండి త్వరగా పోదేం? ఈలోగా ఇంకోటి ఆలోచించాను.

డాబా మెట్లమీద కుడిచేతివైపు వరుసగా పూలతొట్లు పెట్టాలి. వేసవికాలపు వెన్నెల్లో పూల మధ్యగా నడిచి డాబామీదికి పోవాలి. ఆ పూలు గులాబీలైతే బాగానే ఉంటాయి. కాని వెధవ్వి చెట్లనిండా ముళ్లు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు తంటాలు పెడతాయి. ఇంకా తోట్లల్లో ఎదిగే మంచిపూలు ఏమున్నాయి? ఈ విషయం పోచా కంపెనీతో సంప్రదించాలి సిందే.

నా పెట్టె సామాను అడుగున పడ్డది. లేక పోతే బండిలోనే పోచాకంపెనీకి ఉత్తరం వ్రాసేవాణ్ని. త్వరగా చేరితే ముందు ఉత్తరం సంగతే చూడవచ్చు. దారి ఎంతకూ తరగదేం?

"ఆఁ, ఎక్కడండీ?" అన్నాడు బండివాడు.

"దండపాణివారి వీధి" అన్నాను.

"ఇదే దండపాణివారి వీధి. ఇల్లెక్కడ?" అన్నాడు బండివాడు. నా గుండెలు ఝల్లుమన్నాయి. ఆ ఇల్లు ఎక్కడో నాకూ తెలియదు. అన్నయ్య వెనుకనే వస్తున్నాడు గదా అని బండి ఎక్కేశాను. కొంచెం తమాయించుకొని బింకంగా బండిదిగి:

"చుట్టూ ప్రహరీఉండే ఇల్లు" అన్నాను అప్రయత్నంగా. ఆ వీధిలో అన్ని ఇళ్ళకూ ప్రహరీ ఉంది. అక్కడికీ రెండుమూడు ఇళ్ళ దగ్గర అడిగి చూశాను.

"ఫలానావారు అద్దెకు తీసుకొన్న ఇల్లు ఎక్కడండీ?" అంటే, "ఎవరిల్లూ?" అన్నారు వారు. అక్కడే వచ్చింది చిక్కంతా. బండివాడి పేచీ ఎక్కువైంది.

"ఇల్లు తెలియకుండా ఎట్లావచ్చారండీ?" అని దబాయిస్తున్నాడు.

"తెలియకపోవడమేం? ఈ వీధే" అంటూ ధైర్యంచేసి ఒక ఇంటితలుపు తట్టి పిలిచాను. ఎవరో ఒకావిడ సగం తెరిచిన తలుపు వెనక నిలబడి బయటికి తొంగిచూస్తూ "ఎవరు" అన్నది.

"ఫలానావారు అద్దెకు తీసుకొన్న ఇల్లెక్కడండీ?"

"మీకు యెవరిల్లు కావాలి?" సూటిగా అడిగింది. "ఈ వీధిలోనేనండి, చుట్టూ పూల మొక్కలు, మధ్యనో చిన్న డాబా"

తపీమని తలుపువేసి " ఈ వీధిలో పూల మొక్కలున్న ఇల్లు లేదు." అంటూ లోపలికి పోయింది.

ఆవిడ అన్నట్లు పూలమొక్కలెక్కడివి? ఇంకా విత్తనాలు కోసం ఉత్తరమైనా వ్రాయందే?

"ఓహో, ఇది బాగానే ఉంది. నేనింకో బాడుగేదన్నా చూసుకోవాలా? మీతో ఊరంతా బలాదూరు తిరగమన్నారా?" బండివాడు రుద్రుడైనాడు. వాడు బూతులు తిట్టనందుకు సంతోషించి, ఆదుర్దాగా మళుపు తిరిగాను. మా అన్నయ్య కేక వినిపించింది. "బ్రతుకు జీవుడా" అనుకుంటూ ఆయన్ను కలుసుకొన్నా.

"ఇంటాయన పేరు చెప్పావు కాదు, ఇందాకటినుంచీ అవస్థ పడుతున్నాను."

"ఇంటాయన కాదు. ఇంటావిడ. ఆవిడ పేరు నాకూ తెలియదు" అన్నాడు అన్నయ్య.

"ఇంటావిడా!" అప్రయత్నంగా అనేశాను.

హిందూకోడు బిల్లు అదివరకే అమల్లో ఉన్నదన్నమాట!

సామానంతా ఇంట్లోకి చేరేశాము. ఒక్కమాటు ఇంటిచుట్టూ తిరిగి వచ్చాను.

"మెట్లేవి?" అన్నయ్యనడిగాను.

"లేవు" అన్నాడాయన.

కొరడాతో కొట్టినట్లుగా ఉందినాకు. నా పూల బాటలు నీట కలిశాయి. డాబా మీది వెన్నెలంతా వృధాయేనా? అసలక్కడ వెన్నెలే కాస్తోందో, చీకటే పులుముకుందో?

ఇంటి చుట్టూ ఖాళీస్థలముంది. పూలబాటలు లేక పోతే మానె పూలతోటలు వేసుకోవచ్చు. దెబ్బతిన్న మనస్సు కాస్త కుదుటపడ్డది.

"ముందు గదిలో నా సామాను సర్దుకుంటే ఆటోమాటిక్‌గా అన్నయ్య ప్రక్కగదిలోకి వెళతాడు." ఈ అభిప్రాయం నన్ను కార్యశూరుణ్ని చేసింది. గదితలుపు బలంగా నెడుతున్నా రాదేం?

"అదేమిటిరా! ఆ గది మనది కాదు. ప్రక్క భాగంలో వేరే అద్దెకున్నారు" అన్నాడు అన్నయ్య.

"ప్రక్కభాగం! ఇల్లంతా మనక్కాదూ?"

"ఆఁ హాఁ, సగమే."

"అయితే మనకు గదులేవి?"

"మన భాగంలో గదులు లేవు. మధ్యహాలే గదిగా ఉపయోగించుకోవాలి."

ఈ దఫా నా వెన్ను విరిగింది. దానితో నా సామానే కాదు ఏ సామానూ కదిలించలేదు, మెల్లిగా ఇవతలికొచ్చేశాను. మెట్లు లేవు గదులు లేవు. ప్రక్కన మరో కాపురం. ఇంటిచుట్టూ పూలతోటలు వేయడానికి నాకెలా వీలవుతుంది? ఇంక మిగిలింది ఇంటి ప్రక్కన పూలతోటే.

అన్నయ్యా, అమ్మా సామాను సర్దుతున్నారు. నేను ప్రక్కనున్న ఖాళీ స్థలంలో పూలతోటకు ప్లాను వేస్తున్నాను. ఆ స్థలమంతా తోటవేస్తే వేసవిలో పడుకొనేదెక్కడ? అంతా అనుకొన్నదానికి వ్యతిరేకంగా ఉంది.

తాళపుచెవుల గుత్తి బొడ్లో దోపుకొని రంగుచీరె కట్టుకొన్న విధవావిడ ప్రత్యక్షమైంది. ఇంటావిడని ఇట్టే తెలిసి పోయింది.

"ఏమండీ! మెట్లు కట్టించలేదేం?"

"మెట్లు కట్టిస్తే పిల్లలు పైకెక్కి పడిపోతారండి" ఈ సమాధానం నాకు వింతగా ఉంది. రోజుకు రెండు వందల కొంటె వెధవలకు పాఠాలు చెబుతున్నాను. ఐదు సంవత్సరాలుగా ఇలాంటి సమాధానం నాకు రాలేదు. పట్టలేక ఆవేశంగా అడిగాను:

"మెట్లు కట్టించిన డాబా ఇంటివారికి పిల్లలు లేరంటారా?"

"అది కాదండీ! మా డాబాకి పిట్టగోడ లేదు" అన్న దావిడ.

తల పైకెత్తి చూశాను. పాత పద్ధతుల్లో పెరిగి కొత్తగా ముండ మోసిన బ్రాహ్మణిలాగ ఉంది ఆ ఇల్లు.

"ఇదేమిటండీ ఇల్లు ఇంత బోడిగా ఉంచారు? పిట్టగోడా మెట్లూ కట్టించండి" సలహా ఇచ్చాను.

నిబ్బరంగా నవ్వి శుభ్రంగా చెప్పింది:

"మీరేమండీ! మాటలు చెబుతారు పని చేయించేసరికి తాతలు తలుపుకొస్తున్నారు. ఏ వస్తువుచూచినా బ్లాకులో మండిపోతున్నది. ఇప్పటికే పన్నెండు వేలు అయింది. ఇంకా డబ్బెక్కడ తెచ్చేదండి?"

ఉపన్యాసం త్వరగా ముగిసినందుకు సంతోషించి,

"ఇదంతా చెత్తా చెదారం, మిట్ట పల్లాలు అసహ్యంగా ఉంది. దీన్ని కాస్త బాగుచేయించండి" అన్నాను ఇంటి ప్రక్కని ఖాళీ జాగా చూపుతూ.

"ఆ చెత్త తీసెయ్యడ మెందుకండి! వచ్చేది వానాకాలమాయె. వానలకి కుళ్ళి మట్టవుతుంది. అప్పుడదే చదునై పోతుంది" అన్నది. అది విన్న నాగుండె గుబుక్కుమన్నది.

మా అన్నయ్య బావిదగ్గర నీళ్ళు తోడుతున్నాడు. అక్కడికి వెళ్ళి కాసిని నీళ్లు నోట్లో పోసుకొన్నా. అవి ఉప్పో, చేదో, వగరో, దో, నాకు తెలియలేదు. మనవాళ్లు చెప్పే షడ్రుచుల్లో ఏదీకాదు.

"ఈ నీటితో పూలమొక్కలు పెరుగుతాయా?" అని నా ఆలోచన.

"వీటితో పప్పు ఉడుకుతుందా?" అని మా అమ్మ గొడవ.

"సబ్బు ఈ నీటికి నురుగు వస్తుందా?" అని మా వదినెగారి అనుమానం.

అందరి సందేహాలూ ఇంటావిడ తీర్చేసింది. "చెట్లకేం దొబ్బడాయి, నిక్షేపంలా పెరుగుతాయి. సోడావేస్తే పప్పు ఉడుకుతుంది. అది కొంచెం ఎక్కువగా వెయ్యాలి గనుక పప్పులో వేరే ఉప్పు అవసరం లేదు. సబ్బు ఈ నీటికి పనికిరాదు, కుంకుడుకాయ వాడాలి. ఐతేనే మంచీ! ఆకలి పుట్టించి చక్కగా జీర్ణమౌతుంది" అంటూ ముందుకు నడిచింది.

ఆడపెత్తనమంటారు గాని ఎన్ని ఆర్థికసదుపాయాలు చూపిందో చూడండి. ఒకటి పప్పులోకి ఉప్పు అక్కరలేదు. కాబట్టి రోజువారీ ఖర్చు కొంత తగ్గుతుంది. రెండు కుంకుడుకాయ వాడకంతో సబ్బుముక్కల్లో బోలెడంత కలిసి వస్తుంది. మూడు అన్నం జీర్ణించి ఆకలి పుడుతుంది కాబట్టి డాక్టరు బిల్లులు తగ్గిపోతాయి. ఈ త్రిగుణాత్మకమైన ఆర్థిక సౌకర్యాన్ని అవలీలగా అందించగలిగిన మేధావిని కేంద్రప్రభుత్వంలోకి పంపితే బాగుండునన్నాను మా అన్నయ్యతో.

"ఎందుకూ అక్కడ ఆడపెత్తనం తక్కువైందనా?" అన్నాడాయన.

"అమృతకారుకు తోడుగా ఉంటుంది."

"ఆమె పాత ఇళ్ళ ప్రణాళికతో ముప్పైకోట్ల రూపాయలు తగలేస్తే ఈమె ఈ బావి నీరు దేశమంతా సప్లయిచేసే స్కీముతో ప్రజలనే తగలేస్తుంది."

"అయితే ఆడపెత్తనం అధ్వాన్నమేనంటావు?"

"ప్రత్యక్షప్రమాణానికి సందేహమెందుకు?"

అయినా అంత త్వరగా ఇంత దారుణమైన తీర్మానానికి రాదలచుకోలేదు. మాటల సందట్లో ఒక అడుగు అవతలకేశాను. కాలు విర్రున జారింది. బావిచుట్టూ బురద. ఇంటావిడకోసం వెదికాను. వాకిట గుమ్మందగ్గర నిలబడి "ఈ పందిరి మాదికాదు. ఇదివరకు అద్దెకున్నవారిది. వారు దీన్ని తీసుకుపోతారు" అని మా అమ్మకు చెబుతున్నది.

"ఏమండీ! బావిదగ్గర కాస్త గచ్చుచేయించి పళ్లెం కట్టించ పోయినారా?" అన్నాను.

"ఇంత పెద్దఇల్లు కట్టించి ఆ చిన్న పనులు కూడా ఎక్కడ చేయించేదండీ? మీరు కట్టించుకోండి" అన్నది.

అమ్మ వంటింట్లో మునిగింది. అన్నయ్య తన రికార్డు సర్దుకొంటున్నాడు. పుల్లలు బొగ్గులు అక్కడపడి ఉన్నాయి. వాటినెక్కడైనా చేరుద్దామని బయలుదేరాను. చోటేది? ఇంటి చుట్టూ తిరిగి మళ్ళా ఇంటావిడ దగ్గరకెళ్ళాను.

"పుల్లా పుడకా పెట్టుకోవడానికి చిన్న పాకైనా వేయించండి?" కనీసపు కోర్కెను వెలిబుచ్చాను.

"పాకలంటే నాకు తల నొప్పండీ?"

"పోనీ రెండు రేకులు వేయించండి?"

"రేకు అడుగు రూపాయిన్నర. నేనెక్కడ తెచ్చేదండీ. పోనీ అంతగా కావలిసొస్తే మీరు వేయించుకోండి!" అనుజ్ఞ ఇచ్చింది. ఇంతలోకే అమ్మ కేక వేసింది.

"ఏమిటమ్మా?"

"ఈ నీళ్లు పోవడంలేదు కాస్త చూడు నాయనా?"

తూములోకి కర్రపెట్టి పొడిచాను. కాళ్ళతో నీటిని నెట్టాను. ససేమిరా, ఒక్క చుక్కైనా బయటికి పోలేదు.

"తూములో తుక్కేమైనా అడ్డం పడ్డదా?" అమ్మ అడిగింది.

"ఆడవాళ్లు కట్టించిన ఇల్లమ్మా ఇది. తూము మెరక ఇల్లు పల్లం" రుసరుసలాడాను.

మేము ఆ యింట్లోకి పోవడం నాకు పాతాళ లోకంలోకో ఇంకా దాని అడుగున ఏదైనా లోకం ఉంటే దానిలోకో పోయినట్లుగా ఉంది. కాసిని చన్నీళ్లు నెత్తినబడితే కొంచెం శాంతి వస్తుందని సబ్బు ముక్క పట్టుకొని గబగబ నడుస్తున్నాను.

"ఎక్కడికిరా?" అన్నాడు అన్నయ్య.

"బాత్ రూమ్‌కి."

"బావిదగ్గర స్నానం చేసిరా" అన్నాడు. ఆటం బాంబు పడ్డట్టుగా ఉంది.

"స్నానాలగదైనా లేని ఇల్లేమిటి? దానికి అరవైరూపాయిల అద్దేమిటి?" అన్నాను అక్కసు పట్టలేక.

"మొన్న ఉంది. ఈవేళ లేదు"

"ఇంతలోకే ఏమైంది?"

"పడగొట్టి ఆ రాళ్ళతో ప్రక్కవారికీ మనకీ మధ్యగోడ కట్టించింది. ఇంటామె" అన్నాడు అన్నయ్య.

"అదేమిటి?" అన్నాను అయోమయంగా.

"ఆడపెత్తనం" అన్నాడు ముక్తసరిగా.

* * *

అమ్మ ప్రొద్దున్నే స్నానంచేసి తులసి మొక్కచుట్టూ తిరిగి ఒకఆకు గిల్లి నోట్లో వేసుకొంటుంది. ఎక్కడ చూసిందో మేకపిల్ల అన్ని ఆకులూ ఒక్కమాటే నోట్లో వేసుకున్నది. అమ్మ కంట తడిపెట్టుకొన్నది.

"గేటువేసి ఉంటే ఎలా పోయిందమ్మా"

"అదిగో ఆ పసుపుపాతర మీదగా"

గబగబా వెళ్ళి ఇంటావిడనడిగాను.

"ఆ పాతర తీసేయించండి"

"మాదికాదండి ఎవరో అద్దెకి పోసుకొన్నారు."

"మాదొడ్డి ఇంకొకరికి ఎందుకిచ్చారు?"

"మీదొడ్డి ఏమిటండీ? ఇల్లు మీకు అద్దెకిచ్చాను. దొడ్డి వారికి అద్దెకిచ్చాను." ఎంత సులువుగా చెప్పేసింది?

# ఆంధ్ర ప్రశస్తి!

పెనుమర్తి కామేశ్వరరావు

ఈ దేశ మావేశ హిండన మండితము
ఈ ప్రజలు సుందర సుప్రతీకులు జగతి!
ఒక వాంఛ, ఒక బాధ యుత్తుంగమై యెగయ
ఆపుకోలేరు సంతాపమ్ము, క్రోధమ్ము!
బహు నాయకుల కొహావ రంగమీ భూమి
ఒకని కీర్తి సహించ నోర్పులేనిదీ జాతి!
సతతమ్ము విద్వేష సమర క్రీడారంగ
మీ యాంధ్ర దేశమ్ము, ఈ సాంద్ర దేశమ్ము!
స్వప్రకాశము నరయజాలని మూర్ఖులై
పరుల కీర్తిని బాటపాడెడి బట్టులై
ఈ యసూయాపరులీ యాంధ్రు లింకెట్లు
రాష్ట్రమ్ము నిర్మించు? రాష్ట్ర పాలన సేయు?
ఈ దేశ మావేశ హిండన మండితము!
స్వార్థపరుల కుతంత్ర సాధనమ్ములు హెచ్చి
ఆంధ్ర నాయకులం దైకమత్యము సచ్చి
పరులయందను జేరి పగలు సాధించగా
ఉత్సాహమును జూపు నుద్రేక భీరువులు!
ఐకమత్యములేని యాంధ్రుల గతియేమి?
అరవ దౌష్ట్యము క్రింద నణగి పడియుండుటే!
ఐకమత్యము లేని ఆంధ్రుల భవిష్యత్తు
కులవర్గ ద్వేషాల గూలిపోవుటయే!